AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



2



2

## క్రీడోత్సవాలకు రావాలని ఆహ్వానం



నగరంలోని బైపాస్ రోడ్‌లోని అశోక టౌన్‌షిప్‌లో వినాయక చవితి సందర్భంగా బొజ్జగణపయ్యను ప్రతిష్ఠించారు. ఈ మేరకు శనివారం నిమజ్జనం సందర్భంగా మండపంలో లడ్డూను వేలం వేశారు. ఈ వేలంలో లడ్డూను వసంత్‌రెడ్డి రూ.2,09,000కు లడ్డూను దక్కించుకున్నారు.





నగరంలో వినాయక విగ్రహాలతో యువతులు



# గంగమ్మ ఒడికి గణనాథుడు

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా వినాయక నిమజ్జనం
- శోభాయాత్రలో యువత సందడి
- పోలీసుల భారీ బందోబస్తు

**అక్షరటుడే, ఇందూరు/ కామారెడ్డి:** గౌరీ తనయుడు గంగమ్మ ఒడికి చేరాడు. మండపాల్లో ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడిని భక్తులు నిమజ్జనం చేశారు. ఉమ్మడి జిల్లాలో శనివారం గణపతి నిమజ్జన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండపాల నిర్వాహకులు, యువత నృత్యాలతో శోభాయాత్రలో సందడి చేశారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో నిమజ్జన శోభాయాత్రను తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌లో సీపీ సాయి చైతన్య నేతృత్వంలో 1300 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. నిజామాబాద్ నగరంలో సార్వజనిక్ గణేశ్ మండలి రథయాత్రను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్య నారాయణ, సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య



జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని పలు ప్రాంతాల మీదుగా వినాయకుల బావి వరకు రథయాత్ర సాగింది. భక్తులు పెద్ద ఎత్తున వినాయకులను రథంలో కూర్చోబెట్టారు. రథాన్ని లాగడానికి 21 జతల ఎడ్లు కట్టారు. నగరంలోని గోల్ హనుమాన్ చౌరస్తాలో సంస్కార భారతి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్న విగ్రహాలను వినాయకుల బావిలో, పెద్ద విగ్రహాలను బాసర, నందిపేట మండలం ఉమ్మెడ వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు. కామారెడ్డి పట్టణంలో శుక్రవారం రాత్రి 9:30 గంటలకు మొదలైన శోభాయాత్ర శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. వినాయకులను అంగరంగ వైభవంగా ప్రత్యేక వాహనాల్లో నిమజ్జనానికి తరలిస్తున్నారు. నంబర్ సిస్టం తొలగించడంతో విగ్రహాలను ఇష్టానుసారంగా వివిధ రూట్లలో నిమజ్జనానికి తరలిస్తున్నారు. దాంతో శోభాయాత్ర ఆలస్యంగా సాగుతోంది. పట్టణంలోని విగ్రహాలను టేక్రియాల్ చెరువులో నిమజ్జనం చేశారు.



బాన్సువాడలో నిమజ్జన శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే పోచారం



నగరంలో జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభిస్తున్న నేతలు



శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య



కామారెడ్డిలోని టేక్రియాల్ చెరువులో వినాయక నిమజ్జనం

## 15న కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సంబరాలు

**అక్షరటుడే, కామారెడ్డి :** తాము అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై బిల్లులను అసెంబ్లీలో ఆమోదించింది. వాటిని కేంద్రం పెండింగ్‌లో పెట్టడంతో మరోసారి బీసీ రిజర్వేషన్ పై తీర్మానం చేసిన గవర్నర్ ఆమోదం కోసం పంపించింది.

బిల్లు ఆమోదం పొందకపోతే పార్టీ పరంగా 42 శాతం టికెట్స్ ఇచ్చి ఎన్నికలకు వెళ్లేలా కాంగ్రెస్ ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో ఎక్కడైతే బీసీ డిక్లరేషన్ హామీ ఇచ్చామో అక్కడే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి సంబరాలు జరిపేలా కాంగ్రెస్ అధినాయకత్వం ఆలోచిస్తోంది. కామారెడ్డిలో ఈ నెల 15న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, తెలంగాణ, కర్ణాటక సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య హాజరు కానున్నట్లు సమాచారం.

### సన్నాహక సమావేశం

బీసీ డిక్లరేషన్ సంబురాలు పేరిట నిర్వహించే ఈ సభ కోసం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



నివాసంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ సన్నాహక సమావేశంలో పాల్గొననున్నారు.

### ఇచ్చిన మాట నిలుపుకున్నాం..

కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు పెట్టుకున్న నమ్మకం నిలుపుకుంది. కుల గణన చేపట్టి రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టాం. బీఆర్ఎస్ నాయకులు కులగణన జరుగుతుంటే సహకరించొద్దని ప్రచారం చేశారు. అయితే విజయవంతంగా కులగణన చేపట్టాం. రాష్ట్రవ్యాప్తంగా బలహీన వర్గాల సంఘాలను పిలిచి మరీ బహిరంగ సభ పెట్టి సంబరాలు ఘనంగా నిర్వహిస్తాం.

**– షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారు**

## పంటలను పరిశీలించిన టీజీఎండీసీ ఛైర్మన్

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బడా భీమ్‌గల్, సికింద్రాబాద్, గొన్‌గొప్పుల తదితర గ్రామాల్లో వర్షాలకు నష్టపోయిన పంటలను టీజీఎండీసీ ఛైర్మన్ అనిల్ ఈరవత్రి శనివారం పరిశీలించారు. వరదలకు పంటలో వేసిన ఇసుక మేటలను చూసిన ఆయన రైతులతో మాట్లాడారు. ఇసుక మేటలను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని అలాగే నష్టపోయిన పంటలకు పరిహారమందేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. భీమ్‌గల్ కప్పల వాగుపై ఉన్న వంతెన, అలాగే భీమ్‌గల్ మధ్య గల ప్రధాన రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంపై ఆయన మాట్లాడుతూ రోడ్డును వెంటనే పునరుద్ధరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే ధ్వంసమైన బ్రిడ్జిని సరిచేసే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ అంజాగౌడ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. అలాగే బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి రాగుల లింబాద్రి కంటికి శస్త్రచికిత్స చేయించుకోగా ఆయనను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి, జిల్లా కార్యదర్శి కుంట రమేష్, జైజై నర్సయ్య, గోపాల్ నాయక్, ఆరేపల్లి నాగేంద్ర, గట్టు సతీష్, మల్లేష్, పిట్ల శ్రీనివాస్, రాగుల మోహన్, సురేష్ ఉన్నారు.



## కలెక్టరేట్‌లో పాలనాధికారి ఆకస్మిక తనిఖీలు



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**అక్షరటుడే, ఇందూరు :** ఐడీవోసీలోని పలు శాఖలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయ, హౌసింగ్ కార్యాలయాలను సందర్శించి పనితీరును సమీక్షించారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం వివరాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. బాధిత రైతులకు ప్రభుత్వ పరంగా సహాయం అందేలా పక్కా వివరాలు పొందుపర్చాలన్నారు. వరదల కారణంగా సిరికొండ, ధర్పల్లి, భీమ్‌గల్, ఇందల్వాయి, వేల్పూర్, వర్ని మండలాల్లో పొలాల్లో ఇసుక మేటలు వేసిందని వివరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇసుక మేటలను ఈజీఎస్ కూలీలతో తొలగింప జేయాలని ఆదేశించారు. హౌసింగ్ శాఖలు తనిఖీ చేసిన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షించారు. లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి త్వరగా పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులు ఆదేశించారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, ఈఈ నివర్తి ఉన్నారు. జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల పనితీరు గురించి కమిషనర్ దిలీప్ కుమార్‌తో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
శనివారం
6.9.2025
www.aksharatoday.in
AKSHARA TODAY

## కుక్కల బెడదను నివారించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండల కేంద్రంలో కుక్కల బెడదను నివారించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహశీల్దార్ భుజంగరావుకు వారు వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలో రోజురోజుకూ వీధికుక్కల సంఖ్య పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారులను కుక్కలు ఎక్కువగా గాయపరుస్తున్నాయని వాటిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి యోగి, ఉపాధ్యక్షుడు వడ్ల బస్వరాజ్, సీనియర్ నాయకులు బీరుగొండ, గజేందర్, జగదీశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడోత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం




**అక్షరటుడే, ఆర్మూర్:** నియోజకవర్గంలో నిర్వహించనున్న అంతర్‌పాఠశాలల టోర్నీ ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని టోర్నీ నిర్వాహకులు కోరారు. ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో శనివారం కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు ఆర్మూర్ అర్బన్ టోర్నమెంట్ జరగనుందని వారు పేర్కొన్నారు. అలాగే 15 నుంచి 17 వరకు చేపూర్ ఉన్నత పాఠశాలలో ఆర్మూర్ రూరల్ మండల అంతర్ పాఠశాలల టోర్నీ నిర్వహిస్తున్నట్లు వారు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో స్పోర్ట్స్ కన్వీనర్లు లక్ష్మీ నర్సయ్య, చేతన కుమారి, ఎంఈవో రాజగంగారాం ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు మల్లేశ్‌గౌడ్, మైలారం గంగాధర్, సంగెం అశోక్, సౌడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



**అక్షరటుడే, బాన్సువాడ:** రక్తదానం చేయడంతో అత్యవసర సమయాల్లో ఎన్నో ప్రాణాలు కాపాడుకోగలుగుతామని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ లక్ష్మి అన్నారు. బాన్సువాడ పట్టణంలో ఏరియా ఆస్పత్రిలో మిలాదున్ నబి (మొహమ్మద్ ప్రవక్త జన్మదినం) సందర్భంగా హ్యూమానిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భిణులు, ఆపరేషన్ అవసరం ఉన్నవారి ప్రాణాలను రక్తదానంతో నిలబెట్టవచ్చని తెలిపారు. మౌలానా రిజ్వాన్ మాట్లాడుతూ.. హ్యూమానిటీ వెల్ఫేర్ సొసైటీ రక్తదాన శిబిరంలో హిందూ, ముస్లిం యువకులు పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎజాజ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ డ్రెయినేజీ పనులు ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ డ్రెయినేజీ పనులను శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. నందిపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుండు హరీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ తుక్కన్న, తాబ్రెష్, పీఏసీఎస్ డైరెక్టర్ తోట మహేష్, మాజీ సర్పంచ్ మంగళారపు ధర్మన్న, మాజీ ఉపసర్పంచ్ మంగళవారం చిరంజీవి, ఎల్లమ్మ గుట్ట ఛైర్మన్ బొమ్మ సందీప్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గొర్తే రాకేష్, మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోజూర్ పోశెట్టి, ముస్తాక్, జీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలంలోని పాత పోతంగల్ గ్రామానికి చెందిన కొంతల నాగయ్య శుక్రవారం హఠాన్మరణం చెందారు. అయితే స్థానిక బీజేపీ నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన అంత్యక్రియల నిమిత్తం బీజేపీ మండల అధ్యక్షుడు కల్లూరి హన్మాండ్లు (బజరంగ్ ) చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో దిగంబర్ పటేల్, శ్రీనివాస్ పటేల్, సంతోష్ పటేల్, శెట్టి గంగారాం, మోహన్, ఓమన్న, శంకర్ ఉన్నారు.

# గంగమ్మ ఒడికి గణనాథుడు









కామారెడ్డిలో ఆపరేషన్ సిందూర్ గణపతి





నగరంలోని వినాయకుల బావి వద్ద నిమజ్జనం చేసే ముందు గణనాథుడికి మొక్కుతున్న యువతులు





నగరంలో రథానికి పూజలు



నిజామాబాద్‌లో వినాయక విగ్రహాలతో భక్తులు



ఆర్మూర్ పట్టణంలో..



మాక్లూర్ మండలం గొట్టిముక్కల గ్రామంలో..



బోధన్‌లో శోభాయాత్ర



నిజామాబాద్‌లో యాత్రలో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు



నగరంలో రథాన్ని లాగేందుకు కట్టిన ఎడ్లు



కామారెడ్డిలో శోభాయాత్ర





నందిపేట మండలం ఉమ్మెడలో గోదావరి నది వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, నదిలో విగ్రహాల నిమజ్జనం



ఆర్మూర్ పట్టణంలో..

## గణేశ్ మండలి వద్ద అన్నదానం



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ బజరంగ్‌బలి హనుమాన్ మందిరం వద్ద గణేశ్ మండలిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మండలి అధ్యక్షుడు కేశ వీరేశం మాట్లాడుతూ.. ప్రతి ఏడాది బజరంగ్ బలి గణేశ్ మండలి ఆధ్వర్యంలో వినాయకుని ఏర్పాటు చేసి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు గంధపు పవన్, గణేశ్ మండలి కార్యదర్శి ఉమాకాంత్, ఉపాధ్యక్షుడు టైలర్ సాయిలు, మాణిక్ అప్ప, జగన్, గంధపు రాజు, దత్తు, వడ్ల సంజు, గంగరాజు, కేశ క్రాంతి, గంగాధర్, దత్తు, కుర్మా సాయిలు భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టాలి



**అక్షరటుడే, బోధన్:** పాఠశాలల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంఈవో నాగయ్య అన్నారు. శనివారం పట్టణంలోని విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్వచ్ఛ, హరిత విద్యాలయ రేటింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు నగేష్, సీఆర్పీలు విజయ్, యూసుఫ్, విజయ, రేఖ, దేవానంద్, శివానంద్ పాల్గొన్నారు.

## బాల్కొండలో టీబీ ముక్త్ అభియాన్

**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించారు. ఇందులో భాగంగా కిసాన్ నగర్ మెడికల్ ఆఫీసర్ స్రవంతి టీబీ లక్షణాలున్న పలువురికి తెమడ పరీక్షలు, ఎక్స్ రే నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సంతోష్ కుమార్, పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ మేరీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అలింకో, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగ విద్యార్థులకు వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాలకు చెందిన 70 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా వైకల్య నిర్ధారణ పరీక్షలు చేశారు. అర్హులైనవారికి డిసెంబర్‌లో ఉపకరణాలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త నాగవేందర్, సెక్టోరియల్ అధికారి కృష్ణ చైతన్య, డాక్టర్ శరత్, ఐఈఆర్‌పీ వెంకటేశం, అశ్విని, సాయిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని 44వ జాతీయ రహదారిపై పోచంపాడ్ చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. మెండోరా ఎస్సై జాదవ్ సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాలోని గాంధీనగర్‌కు చెందిన సాస్కిన్ అభిలాష్ తన బంధువుల పిల్లలైన గణేష్, లోకేష్‌తో కలిసి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన గోదావరిలో చేపలు పట్టేందుకు వచ్చారు. వేట ముగిసిన అనంతరం శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. 44వ జాతీయ రహదారిపై పోచంపాడ్ చౌరస్తా వద్దకు రాగానే ఆర్మూర్ నుంచి నిర్మల్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ మధ్యలో కూర్చున్న అభిలాష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు కాగా.. నిర్మల్ జిల్లాలోని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న గుర్తు తెలియని లారీ..

**అక్షరటుడే, కామారెడ్డి:** గణపతి నిమజ్జనం కోసం ట్రాలీ ట్రాక్టర్‌ను తీసుకెళ్తుండగా లారీ ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి జాతీయ రహదారిపై క్యాసంపల్లి శివారులో శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. దోమకొండకు చెందిన యువకులు రామారెడ్డి నుంచి గణపతి ట్రాలీని తీసుకుని వెళ్తున్నారు. ట్రాక్టర్ ఇంజన్ పై నలుగురు యువకులు కూర్చున్నారు. ట్రాలీ బైపాస్ రోడ్డుపై క్యాసంపల్లి శివారులోకి రాగానే వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని లారీ ట్రాక్టర్ ట్రాలీని ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజన్ పై కూర్చున్న నలుగురికి గాయాలయ్యాయి. దోమకొండకు చెందిన సాయికుమార్, శ్రీధర్‌లతో పాటు ట్రాక్టర్ నడుపుతున్న రాజయ్యకు గాయాలయ్యాయి. ఇందులో శ్రీధర్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ రిఫర్ చేశారు. మరొక యువకుడిని సైతం నిజామాబాద్‌కు రిఫర్ చేసినట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.